సాక్షి
అనకాపల్లి
బుధవారం । 25 । అక్టోబర్ । 2023



విశాఖలో సీఎస్

విశాఖ: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి విశాఖ చేరుకున్నారు. నేవీ అపెక్స్ కమిటీ సమావేశంలో పాల్గొంటారు.



కొర్ర బియ్యం పాయసం

సింహాచలం: దసరా సందర్భంగా మంగళవారం సింహగిరిపై భక్తులకు అన్నప్రసాదంలో కొర్ర బియ్యం పాయసం వడ్డించారు.

ఐదు రోజులు ఉష్ణోగ్రతలు

అనకాపల్లి టౌన్: రాగల ఐదు రోజులు ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న 34.2 డిగ్రీలు, 25న 34.5, 26న 34.4, 27న 35, 28న 35.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదువుతాయన్నారు.

న్యూస్‌రీల్

సాయి దివ్యరూపం



పాయకరావుపేటలో సాయిబాబా విగ్రహానికి పుష్పాభిషేకం

పాయకరావుపేట/యలమంచిలి (అనకాపల్లి రూరల్): షిర్డీ సాయిబాబా 105వ పుణ్యతిథి (మహాసమాధి) మహోత్సవాలను మంగళవారం జిల్లా అంతటా వైభవంగా నిర్వహించారు. యలమంచిలి, పాయకరావుపేట, కశింకోట, మాడుగుల తదితర ప్రాంతాల్లో బాబా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం 5 గంటలకు నగర సంకీర్తనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రభాత హారతి అనంతరం బాబా మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించి అర్చనలు చేశారు.

గాజు సీసాలో దుర్గా మాత



గాజు సీసాలో చెక్కిన దుర్గామాత అమ్మవారు



వరప్రసాద్

మాడుగుల రూరల్: సబ్బు బిళ్ల, సుద్ద ముక్క మీద ఎన్నో ఆకారాలు చెక్కిన సూక్ష్మ కళాకారుడు శరగడం గంగ వరప్రసాద్ తాజాగా గాజు సీసాలో దుర్గామాతను అపూర్వంగా చెక్కారు. అమ్మవారి వేషధారణ, మహిషాసురుని వధించడం ఇందులో కనిపిస్తోంది. ఆయన మాడుగుల మండలంలో 108 అత్యవసర వాహనంలో ఈఎంటీగా పనిచేస్తున్నారు. సుమారు నెల రోజులపాటు కష్టపడి అమ్మవారి ఆకారాన్ని చెక్కానని చెప్పారు.

28న ఉపరాష్ట్రపతి విశాఖ రాక

మహారాణిపేట: భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, సుదీష్ ధన్కర్ దంపతులు ఈ నెల 28న తొలి సారిగా విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి ఆ రోజు ఉదయం 11 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. విమానాశ్రయంలో గౌరవ వందనం, పరిచయ కార్యక్రమం అనంతరం నేరుగా ఆంధ్రా మెడికల్ కాలేజీ(ఏఎంసీ)కి వెళతారు. అక్కడ ఏఎంసీ సెంటినరీ ఉత్సవాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంట వరకు అక్కడే ఉంటారు. తర్వాత ఐఎన్ఎస్ డేగాకు బయలుదేరుతారు. అక్కడ కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం ఐఎన్ఎస్ డేగాను సందర్శిస్తారు. మధ్యాహ్నం 3.55 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయం నుంచి ఢిల్లీ బయలుదేరుతారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ సుబ్బారెడ్డికి అప్పన్న జ్ఞాపికను అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

దసరా వైభవం



అనకాపల్లిలో కొలువు దీరిన సతకంపట్టు కనకదుర్గమ్మ



ఉపమాకలో లంక మండపం వద్ద శమీ పూజ





సింహాచలంపై పూలతోటలో ఉన్న శమీవృక్షం వద్ద శమీ దళాలను కోస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో, ట్రస్ట్‌బోర్డు సభ్యులు (ఇన్‌సెట్) రామాలంకారంలో అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి

శరన్నవరాత్రులు ఘనంగా ముగిశాయి. విజయదశమి పర్వదినాన్ని జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అమ్మవారిని అపూర్వ రీతిలో అద్భుతంగా అలంకరించి దసరా వేడుకలను వైభవంగా నిర్వహించారు. దుర్గామాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉపమాక వెంకన్న, సింహాద్రి అప్పన్న తదితర దేవాలయాల్లో శమీ పూజలు నిర్వహించారు. కోలాటాలు, బళ్ల వేషాలు, తిరువీధి ఉత్సవాలతో సోమ, మంగళవారాల్లో జిల్లా అంతటా కోలాహలం నెలకొంది.

- కనకదుర్గమ్మకు భక్తుల నీరాజనాలు
- సింహాచలం, ఉపమాకల్లో శమీ పూజలు

నక్కపల్లి/సింహాచలం : విజయదశమిని పురస్కరించుకుని మంగళవారం సింహాచలం, ఉపమాకల్లో జమ్మివేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సింహాచలం దిగువన పూలతోటలో రాత్రి ఈ ఉత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి రామాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని మేళతాళాలతో సింహగిరి నుంచి పూలతోటలోకి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. పూలతోటలోనే ఉన్న శమీ వృక్షం చెంతన విశేష పూజలు నిర్వహించారు. గ్రామ తిరువీధిని కనులపండువగా నిర్వహించారు. ఉపమాకలో శ్రీదేవీ భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారిని పుణ్యకోటి వాహనంలో బంధుర సరస్సు వద్ద లంకవారి మండపం వద్దకు తీసుకెళ్లి అర్చకస్వాములు జమ్మి చెట్టుకు ధనుర్బాణ పూజలు చేశారు. అనంతరం స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహించారు. ప్రధానార్చకులు గొట్టు ముక్కల వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

సతకంపట్టు కనకదుర్గమ్మ సన్నిధిలో సోనూసూద్

అనకాపల్లి టౌన్: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మను ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు చేశారు. ఈ సందర్భంగా సోనూసూద్ మాట్లాడుతూ అనకాపల్లిలో విజయదశమి వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కనకదుర్గమ్మ రథోత్సవాన్ని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి సీతారామ దేవస్థానం వద్ద ఆయన ప్రారంభించారు.



సతకంపట్టు కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చిన ప్రముఖ సినీ నటుడు సోనూసూద్‌కు జ్ఞాపిక బహూకరణ

జగనన్న మహిళ మార్ట్‌లు వచ్చేస్తున్నాయ్..!



జగనన్న మహిళా మార్ట్



మార్ట్ లోపల అమ్మకానికి సిద్ధం చేసిన వస్తువులు

- మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించటమే లక్ష్యం
- మార్ట్‌ల ఏర్పాటుకు మెప్మా అధికారుల కసరత్తు

నర్సీపట్నం: స్వయం సహాయక సంఘాలకు సుస్థిర జీవనోపాధి కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రతి మహిళా వ్యాపార నైపుణ్యాలను పెంపొందించుకొని సుస్థిర జీవనోపాధులతో కుటుంబ జీవన స్థితిగతులను మెరుగుపరచుకునేందుకు వీలుగా 'జగనన్న మహిళా మార్ట్'లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు పట్టణ పేదరిక నిర్మూలన మిషన్ (మెప్మా) ఆధ్వర్యంలో మార్ట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రయోగాత్మకంగా మొట్టమొదటిగా పులివెందులలో జగనన్న మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ మార్ట్ రూ.14 కోట్ల టర్నోవర్‌తో విజయవంతంగా నడుస్తుండడంతో.. రాష్ట్రవ్యాప్తంగా విశాఖపట్నం సహా 13 మహిళా మార్ట్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ప్రయత్నం సత్ఫలితాలు ఇస్తుండడంతో అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీల్లో ఏర్పాటుకు మెప్మా అధికారులు కసరత్తు చేపట్టారు.

స్వయం సహాయక సంఘాలకు చక్కని అవకాశం

జిల్లాలో 2,620 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 26 వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. స్వయం సహాయక సభ్యులకు సుస్థిరమైన ఆదాయం కల్పించాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన. అందుకే స్వయం సహాయక సభ్యుల భాగస్వామ్యంతో మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. సూపర్‌మార్కెట్ తరహాలో నర్సీపట్నం, యలమంచిలి పట్టణాల్లో కొద్ది రోజుల్లో మహిళా మార్ట్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఈ మార్ట్‌ల దైనందిన కార్యకలాపాల కోసం నిర్వహణ, సరకు పరిశీలన, కొనుగోలు, ఆర్థిక కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. వ్యాపార లావాదేవీలను బ్యాంక్ ద్వారా నిర్వహించనున్నారు. మహిళా మార్ట్‌లతో ఆదాయం సమకూరడంతోపాటు కొంతమంది మహిళలకు ఉపాధి కలుగుతుంది. స్వయం సహాయక సభ్యులు తయారు చేస్తున్న వస్తువులు, నిత్యావసర సరకులతోపాటు అన్ని రకాల వస్తువులు మహిళా మార్ట్‌లో లభించనున్నాయి.

సంస్థలతో కలిసి...



ఇప్పటికే వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లను ప్రభుత్వం ప్రారంభించింది. ఆయా దుకాణాలకు తక్కువ ధరలకు పలు కార్పొరేట్ సంస్థలు సరకులను అందజేస్తున్నాయి. కొత్తగా నర్సీపట్నం, యలమంచిలిలో ఏర్పాటు కానున్న జగనన్న మహిళా మార్ట్‌లకు కూడా ఆయా సంస్థలు సరకులు సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

–సరోజిని, జిల్లా మెప్మా పీడీ

పండగ పూట విషాదం

- ట్రాక్టర్ పై నుంచి జారిపడి బాలుడి మృతి
- తండ్రితో కలిసి గుడికి వెళుతుండగా ప్రమాదం



ప్రమాదంలో మృతి చెందిన అప్పారావు

యలమంచిలి: దసరా పండగ రోజు సరదాగా తండ్రితో కలసి ట్రాక్టర్‌పై దుర్గమ్మ దర్శనానికి వెళ్లిన బాలుడిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. కుమారుడి మరణంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. పట్టణ ఎస్సై పాపినాయుడు తెలిపిన వివరాలు.. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి శ్రీరామనగర్ కాలనీ పెదపల్లికి చెందిన ఉల్లి మంగరాజు తన కుమారుడు ఉల్లి అప్పారావు (7)ను మంగళవారం ఉదయం ట్రాక్టర్‌పై తన పక్కన కూర్చోబెట్టుకుని సమీపంలో ఉన్న దుర్గమ్మ గుడికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఏఎస్ఆర్ కాలనీ సచివాలయం ముందు స్పీడ్ బ్రేకర్ వద్ద ఆకస్మికంగా బ్రేక్ వేయడంతో ట్రాక్టర్ పై నుంచి ఉల్లి అప్పారావు జారిపడి ట్రాక్టర్ చక్రాల కింద పడి నలిగిపోయాడు. తల నుజ్జవడంతో తీవ్ర రక్తస్రావమై ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. రెండో తరగతి చదువుతున్న అప్పారావు మంగరాజుకు ఒక్కగానొక్క కుమారుడు. అతని మృతితో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. తల్లి భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్సై తెలిపారు.

డిసెంబర్‌లో క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో

దాబాగార్డెన్స్: క్రెడాయ్ 9వ ప్రాపర్టీ ఎక్స్‌పో విశాఖలో డిసెంబర్ 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్నారు. బీచ్‌రోడ్డు గాదిరాజు ప్యాలస్ వేదికగా ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు క్రెడాయ్ సంస్థ చైర్మన్ కేఎస్ఆర్‌కే రాజు (సాయి), అధ్యక్షుడు వి.ధర్మేందర్, గౌరవ కార్యదర్శి, ఎక్స్‌పో కన్వీనర్ వి.శ్రీను తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎనిమిదేళ్లుగా క్రమం తప్పకుండా ప్రాపర్టీ ఎక్స్‌పోలు నిర్వహిస్తున్నామన్నారుర. గృహాల కొనుగోలుదారులు, విక్రయదారులకు ఎక్స్‌పో వేదికగా నిలవనుందని, అక్కడికక్కడే లావాదేవీలు జరుగుతుండడం వల్ల క్రెడాయ్ ఎక్స్‌పోకు మంచి ప్రజాదరణ ఉందన్నారు. మరీ ముఖ్యంగా నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగంలోని వాటాదారులందర్నీ ఒకే ప్లాట్‌ఫాంపైకి తేవడమే ఎక్స్‌పో ముఖ్యోద్దేశమన్నారు. అన్ని రకాల ప్లాట్లు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు తదితర వాటిని ప్రఖ్యాత బిల్డర్లతో పాటు పాటు బిల్డింగ్ మెటీరియల్, నిర్మాణ సామగ్రిని తయారు చేసే ప్రఖ్యాత కంపెనీలు కూడా ఈ ఎక్స్‌పోలో పాల్గొంటున్నాయని తెలిపారు. పలు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ముందుగా ఆమోదించిన గృహ రుణాలు ప్రాసెస్ చేయడం కూడా అదే సమయంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఆన్ ది స్పాట్ బుకింగ్స్ కోసం ప్రోత్సాహకాలు, ప్రత్యేక డీల్‌లు ఉంటాయన్నారు.

స్టాఫ్ నర్సుల భర్తీకి ప్రొవిజినల్ జాబితా విడుదల

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీలో భాగంగా అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితా వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమా సుందరి విడుదల చేశారు. సోమవారం సాయంత్రం జాబితాను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పంపంగా వారు http@//cfw.ap.nic.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. జాబితాపై అభ్యంతరాలుంటే మూడు రోజుల్లోగా తెలియజేయాలన్నారు. త్వరలో ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల చేస్తామన్నారు.

పోస్టుల వివరాలు

మొత్తం ఆరు జిల్లాల్లో 86 పోస్టులకు వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్‌డీ) దరఖాస్తులు స్వీకరించారు. శ్రీకాకుళం,విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మొత్తం 10,659 దరఖాస్తులు వచ్చాయి. వీటిని ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఉమా సుందరి ఆధ్వర్యంలో సిబ్బంది పరిశీలించారు. 86 పోస్టులకు గానూ మొత్తం 7,765 పోటీ పడుతున్నారు.

విజయనగరం జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలో 80 మంది స్టాఫ్ నర్సులు, వైద్య విధాన పరిషత్ పరిధిలో ఆరు పోస్టులు భర్తీ చేయనున్నారు. స్టాఫ్ నర్సుల పోస్టులను మెరిట్, రోస్టర్ విధానంలో భర్తీ చేయనున్నారు.

రూ.8 లక్షలు దాటిన జూ ఆదాయం



జూ ప్రధాన ద్వారం వద్ద సందర్శకుల సందడి



తెల్ల పులి ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కుకి దసరా తాకిడి పెరిగింది. ఇంత వరకు బోసిపోయిన జూ పార్కు పాఠశాలలు, కార్యాలయాలకు దసరా సెలవులు కావడంతో నాలుగు రోజులుగా సందర్శకులతో కిటకిటలాడుతోంది. మంగళవారం విజయదశమి సందర్భంగా మరింత తాకిడి పెరిగింది. దీంతో జూకి రూ.లక్షల్లో ఆదాయం చేకూరింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జూ పార్కును 8,253 మంది సందర్శించారు.

వారి ద్వారా రూ.8,17,377లు ఆదాయం లభించినట్లు జూ అధికారులు తెలిపారు. గత ఏడాది కార్తీక మాసం ఆదివారాల తర్వాత ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం లభించడం పట్ల అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. జూని సందర్శించిన పిల్లలు, పెద్దలు ఇక్కడి వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద సరదాగా గడిపారు. పక్షులు, జంతువులు సందర్శకులను అలరించాయి.

• డోర్ డెలివరీ వేగంగా.. విస్తృతంగా..



- ప్రస్తుతం పరిమిత స్థాయిలోనే సరకు డెలివరీ
- కొత్తగా ఉత్తరాంధ్రలో మరిన్ని పట్టణాలకు విస్తరణ
- రోజుకు 400 వరకు పార్సిళ్ల పంపిణీ లక్ష్యం
- రేపటి నుంచి నెల రోజులు ఆర్టీసీ అధికారుల ప్రచారం

పార్సిల్/కొరియర్	ధర
ఒక కిలో	రూ.18
ఆరు కిలోలు	రూ.30
పది కిలోలు	రూ.36
25 కిలోలు	రూ.48
25–50 కిలోలు	రూ.59

సాక్షి, విశాఖపట్నం: ఇంటికే పార్సిళ్లు, కొరియర్‌లను పంపిణీ చేసే డోర్ డెలివరీ వ్యవస్థను మరింత విస్తృతం చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇప్పటికే ఆర్టీసీ డోర్ డెలివరీకి ప్రజల్లో ఆదరణ ఉంది. అయితే ఇప్పటివరకు అది పరిమిత స్థాయిలోనే పంపిణీ జరుగుతోంది. ఆర్టీసీ యాజమాన్యం నిర్వహించిన సర్వేలో 66 శాతం మంది ఖాతాదారులు డోర్ డెలివరీకే ప్రాధాన్యమిస్తున్నట్టు వెల్లడైంది. దీనిని దృష్టిలో ఉంచుకుని డోర్ డెలివరీ సదుపాయాన్ని మరింత విస్తరించడానికి సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా మరిన్ని పట్టణాలకు ఈ సదుపాయాన్ని కల్పించనుంది. ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాల్లో విశాఖపట్నం, విజయనగరంల్లో మాత్రమే డోర్ డెలివరీ సదుపాయం ఉంది. ఇప్పుడు పలాస, శ్రీకాకుళం, బొబ్బిలి, మద్దిలపాలెం(విశాఖపట్నం), అనకాపల్లి, నర్సీపట్నంలోనూ దీనిని అందుబాటులోకి తీసుకురానుంది. ఆయా పట్టణాల్లో 10 కిలోమీటర్ల పరిధి వరకు డోర్ డెలివరీ చేయనున్నారు. ఇందుకు కిలో బరువున్న పార్సిల్/కొరియర్ కవర్‌కు రూ.18, ఆరు కిలోల వరకు రూ.30, పది కిలోలకు రూ.36, 25 కిలోల వరకు రూ.48, 25–50 కిలోల వరకు రూ.59 చొప్పున వసూలు చేస్తారు. ప్రస్తుతం విశాఖపట్నం, విజయనగరం పార్సిల్ బుకింగ్ కేంద్రాల నుంచి రోజుకు సగటున 20 వరకు డోర్ డెలివరీ సేవలు అందుతున్నాయి. ఇప్పుడు జోన్–1 పరిధిలో కొత్తగా ఈ పట్టణాలకు ఈ సదుపాయం విస్తరించనుండడంతో ఆ సంఖ్య 400 వరకు పెంచాలని ఆర్టీసీ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. డోర్ డెలివరీ చేయడానికి గతంలో జోన్ల వారీగా కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఇకపై రాష్ట్రం మొత్తం మీద సింగు సొల్యూషన్స్ అనే ఒక్క సంస్థకు మాత్రమే ఖరారు చేశారు. దీని వల్ల ఏదైనా సమస్య తలెత్తినా ప్రధాన కేంద్రం నుంచే సరిచేసే వీలుంటుందని భావిస్తున్నారు.


విస్తృత ప్రచారం

ఆర్టీసీ యాజమాన్యం డోర్ డెలివరీ సేవలను విస్తృతం చేస్తున్న విషయాన్ని జనంలోకి బాగా తీసుకురావాలని ఎండీ ద్వారకా తిరుమలరావు సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా ఈనెల 26 నుంచి వచ్చే నెల 25 వరకు నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఆర్టీసీ పార్సిల్, కొరియర్, సరకు రవాణాలో భాగస్వాములయ్యే కాంట్రాక్టర్లు, ఏజెంట్లు, ఆపరేటర్లతో సమావేశం కానున్నారు. అంతేకాదు బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, పోస్టాఫీసులు, వాణిజ్య సముదాయాలు, కిరాణా స్టోర్లు, ఆలయాలు, విద్యాసంస్థలు, అపార్ట్‌మెంట్లకు వెళ్లి ఆర్టీసీ డోర్ డెలివరీ సదుపాయంపై వివరించనున్నారు. ఇంకా ఫ్లెక్సీల ఏర్పాటు, కరపత్రాల పంపిణీతో పాటు సినిమా హాళ్లు, లోకల్ టీవీలు, బిగ్ స్క్రీన్లపై ఆడియో, వీడియోలను ప్రదర్శించనున్నారు. ఇందుకు ఆర్టీసీ ఉద్యోగులు కూడా విధిగా సహకరించాలని కోరారు. దీనిపై ప్రముఖులను, స్థానిక అధికారులను ఆహ్వానించి డిపోల వారీగా సమావేశాలు నిర్వహించనున్నారు.



ద్వారకా బస్‌స్టేషన్‌లో పార్సిల్ కార్యాలయం

కార్గో సేవలపై విశ్వసనీయత



ఆర్టీసీ కార్గో సేవలపై ప్రజల్లో ఎంతో విశ్వసనీయత ఉంది. ఆర్టీసీ ద్వారా బుక్ చేసిన సరకులు, పార్సిళ్లు, కొరియర్లను ఇతర సంస్థలకు దీటుగా రాష్ట్రంలో 24 గంటల్లోనే డెలివరీ చేస్తున్నాం. ప్రజాదరణ పొందిన ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలను విస్తృతం చేస్తున్నాం. దీని వల్ల ప్రజలకు మరింతగా చేరువవుతాం. డోర్ డెలివరీతో పాటు పికప్ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తెస్తాం. ప్రజలు ఈ అవకాశాలను వినియోగించుకోవాలి.

– బలిజి అప్పలనాయుడు, ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ కమర్షియల్ మేనేజర్

క్లుప్తంగా

రూ.34 వేలు పలికిన లడ్డూ



సర్పంచ్ దంపతులకు లడ్డూ అందజేస్తున్న కమిటీ సభ్యులు

మాకవరపాలెం: దుర్గాదేవి మండపం వద్ద నిర్వహించిన వేలంలో లడ్డూ రూ.34 వేలు పలికింది. మండలంలోని బూరుగుపాలెంలో సోమవారం రాత్రి దుర్గమ్మ మండపం వద్ద పది కేజీల లడ్డూకు వేలం నిర్వహించారు. ఈ వేలంలో పాల్గొన్న సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో లడ్డూను కమిటీ సభ్యులు సర్పంచ్ దంపతులకు అందజేశారు.

ట్రాక్టరు ఢీకొట్టడంతోనే యువకుడి మృతి

- నిందితుడు అరెస్టు

మాకవరపాలెం: ట్రాక్టర్ ఢీకొట్టడంతోనే యువకుడు మృతి చెందాడని ఎస్ఐ రామకృష్ణారావు మంగళవారం తెలిపారు. మండలంలోని తామరం గ్రామానికి చెందిన పెదపల్లి సాయి(23) శనివారం రాత్రి స్నేహితులతో బయటకు వెళ్లి తిరిగి గాయాలతో వచ్చి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తొలుత అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ట్రాక్టర్ ఢీకొట్టడంతోనే మరణించినట్టు నిర్ధారణ అయిందని ఎస్ఐ తెలిపారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ లెక్కల పెంటయ్యానాయుడును అరెస్టు చేశామన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు రూ.3 లక్షల సామగ్రి వితరణ



కార్మికులకు గృహోపకరణాలు, బట్టలను అందిస్తున్న దాత సూర్యనారాయణ

కె.కోటపాడు: మండలంలోని కింతాడ గ్రామానికి చెందిన రావాలమ్మ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ యజమాని కన్నూరు సూర్యనారాయణ దాతృత్వం చాటుకున్నారు. తన స్వగ్రామానికి చెందిన 70 మంది భవన నిర్మాణ కార్మికులకు రూ.3 లక్షల విలువైన వంట పాత్రలు, దుస్తులను మంగళవారం పంపిణీ చేశారు. ఏటా పర్వదినాల్లో ఈ విధంగా సాయం అందిస్తున్న సూర్యనారాయణ పలువురికి స్ఫూర్తిదాయకమని సత్యసాయి సేవా సంస్థల జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ కశిరెడ్డి అప్పలనాయుడు ప్రశంసించారు. కార్యక్రమంలో మండల పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నూరు అప్పలనాయుడు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జయహో దుర్గమ్మ

- ఘనంగా గవరపాలెం నతకంపట్టు దుర్గమ్మ తిరుగు రథోత్సవం



కొత్తతలారివానిపాలెంలో దుర్గమ్మ ఘటాలను ఊరేగిస్తున్న గ్రామ ప్రజలు



వేల్పులవీధి రామాలయం వద్ద జై దుర్గ జైజైదుర్గ ఆధ్వర్యంలో అమ్మవారి చిత్రం





కనకదుర్గమ్మ జాతరలో నేలవేషాలు



అనకాపల్లి నూకాంబిక బాలాలయంలో అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని పంచామృతంతో అభిషేకిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: విజయ దశమి పురస్కరించుకుని గవరపాలెంలో సతకంపట్టు దుర్గమ్మ తిరుగు రథోత్సవం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి సీతారామ మందిరం నుంచి ఈ రథోత్సవాన్ని ప్రారంభించారు. అక్కడ నుంచి నెహ్రూ చౌక్, ఎన్టీఆర్ క్రీడా మైదానం, వేల్పులవీధి జంక్షన్, మెయిన్ రోడ్డు, పెరుగుబజారు జంక్షన్, రింగ్‌రోడ్డు మీదుగా గవరపాలెం పురవీధుల్లో అమ్మవారి రథాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. నేల వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్టేజ్ ప్రోగ్రాంలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఉత్సవాన్ని తిలకించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ దాడి మోహన్‌రావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. దాడి జయవీర్ ఆధ్వర్యంలో నవదుర్గ విగ్రహాలతో వివిధ రూపాల్లో అమ్మవారిని ఊరేగించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అమ్మవారి జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఉత్తరప్రదేశ్ వారణాషి వారి 'అఘోరాలు', వివిధ రాష్ట్రాల నుంచి భారీ నేల వేషాలు, ఏడు రాష్ట్రాల నుంచి జానపద కళా రూపాలు వంటి కార్యక్రమాలు చేపట్టారు. పరమేశ్వరి పార్కు సెంటర్ వద్ద కాంగ్రెగుల గోవింద, నాగేంద్ర, జోగేంద్ర పర్యవేక్షణలో ''ధమాకా'' డ్యాన్స్ షో, జీవీఎంసీ భీశెట్టి అప్పారావు కల్యాణ మండపం వద్ద మళ్ల జగ్గఅప్పారావు ఆధ్వర్యంలో ''వాల్తేరు వీరయ్య'' డూప్స్, దాడి వారివీధి వద్ద దాడి అప్పలనాయుడు, దాడి కిరణ్, శేఖర్ వారి ఆధ్వర్యంలో ''సూపర్ ఫాస్ట్ డాన్స్''కాంగ్రెగుల నారాయణరావు ఇంటి వద్ద గౌరీ శంకర బాలగణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో ''రేలారే రేలా'' డ్యాన్స్, రింగ్‌రోడ్డు జంక్షన్ వద్ద కాంగ్రెగుల బుజ్జి, బుద్ద నాగేశ్వరరావు, పెంటకోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ''డాన్స్ బేబీ డాన్స్'' కార్యక్రమం, కొణతాల శివరామయ్య ఇంటి వద్ద బాల గణపతి సమితి పర్యవేక్షణలో ''రియాలిటీ డాన్స్ షో'', కొణతాల మనోహరనాయుడు విగ్రహం వద్ద పొలిమేర శివఅప్పారావు పర్యవేక్షణలో నరసన్నపేట, రాజ్యలక్ష్మీట్రూప్ వారి ''అల్లూరి సీతారామరాజు బుర్రకథ'', దాడి భోగలింగం విగ్రహం వద్ద ''అమిగోస్ డాన్స్ అండ్ డాన్స్'' పార్కు గోడ దక్షిణ రోడ్డు వద్ద నూకాంబిక సిండికేట్ వారి పర్యవేక్షణలో ''డాన్స్ టూ నైట్'', చిన రామగుడి జంక్షన్ వద్ద ''డాన్స్ హంగామా'', బుద్ద గంగునాయుడు వీధి వద్ద ''గీతాంజలి సినీ ఆర్కెస్ట్రా, అన్నమయ్య సంకీర్తనలు, పార్కు సెంటర్ వద్ద మందుగుండు సీతారామయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ''బాణసంచా'' వంటి కార్యక్రమాలు జరిగాయి.



మాడుగులలో మహరాజులు వాడిన ఆయుధాలకు పూజలు నిర్వహించిన దృశ్యం

ఉపమాక వెంకన్న సేవలో ఉక్రెయిన్ మహిళ



ఉపమాక మూల విరాట్‌ను దర్శించుకున్న ఉక్రెయిన్ వనిత క్లాంట

నక్కపల్లి: ఉక్రెయిన్‌లో యుద్ధ వాతావరణం సద్దుమణిగి శాంతి నెలకొనడంతో ఆ దేశానికి చెందిన మహిళ క్లాంట మంగళవారం ఉపమాక వెంకన్న ఆలయాన్ని సందర్శించింది. ఈమె కొద్ది రోజులుగా దేశంలో పలు ఆలయాలను సందర్శిస్తోంది. అందులో భాగంగా విజయవాడ, అన్నవరం, తిరుపతి ఆలయాలను దర్శించుకుని విజయ దశమి పురస్కరించుకుని ఉపమాక వచ్చారు. ఇక్కడ గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో వెలసిన మూల విరాట్ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చక స్వామి కృష్ణమాచార్యులు ఆమెకు ఆలయ విశిష్టతలను వివరించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉక్రెయిన్‌లో కొద్ది రోజులుగా యుద్ధ వాతావరణం నెలకొందన్నారు. అక్కడ ప్రజలు ప్రశాంతంగా జీవించే పరిస్థితులు తక్కువగా ఉన్నాయన్నారు. శాంతి నెలకొనాలని ఆలయాలను దర్శించుకుంటున్నానని, తాను కొద్ది రోజులుగా ముంబైలో ఓ అద్దె ఇంట్లో ఉంటున్నానని మీడియాకు తెలిపారు.

ఇస్కాన్‌లో రావణ దిష్టిబొమ్మ దహనం



ఇస్కాన్ ఆవరణలో రావణ దహనం

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో దసరా వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో గల సీతారామలక్ష్మణ, హనుమంతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, రాధాకృష్ణులను, సుభద్ర, బలభద్ర జగన్నాథ స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 50 అడుగుల భారీ రావణ దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఫైర్ క్రాకర్ షో, రామలీలపై ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బొజ్జన్న కొండ వద్ద సందర్శకుల సందడి



బొజ్జన్నకొండకు తరలివచ్చిన సందర్శకులు

తుమ్మపాల: జిల్లాలో ప్రసిద్ధ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న బొజ్జన్న కొండకు మంగళవారం పెద్ద ఎత్తున సందర్శకులు తరలివచ్చారు. విజయ దశమి సందర్భంగా జిల్లాలో పలు ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా తరలివచ్చి ఇక్కడ బౌద్ధ స్తూపాలను, లింగాల కొండపై పురాతన బౌద్ధ గుహలను సందర్శించి సెల్ఫీలు తీసుకున్నారు. కొండపై పచ్చని, ఆహ్లాదకరమైన వాతావరణంలో చక్కని ఆటపాటలతో సాయంత్రం వరకు సందడి చేశారు. సాయంత్రం సూర్యాస్తమం సమయంలో కొండ పరిసరాలలో పచ్చని వరి పొలాల అందాలను కెమెరాల్లో బంధించారు. అయితే ప్రస్తుతం కొండ పరిసరాల్లో పాముల బెడద ఉండటంతో అధికారులు సందర్శకులకు సాయంత్రం 5 గంటల వరకే గడువు ఇచ్చారు. సిబ్బంది నిర్లక్ష్యంతో సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత సందర్శకులు కొండపైనే ఉండటంతో పలువురు భయాందోళనలు వ్యక్తం చేశారు. సిబ్బంది ముందుగా తమకు సమయాన్ని తెలియజేయలేదని అసహనం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం వందడుగుల దూరంలోనే వాహనాలను నిలిపివేయాల్సి ఉన్నప్పటికీ కొండ పరిసరాల్లోకి అనుమతించడం, సందర్శకుల పట్ల సిబ్బంది దురుసుగా ప్రవర్తించడంతో సాయంత్రం చిన్నపాటి వాగ్వాదం జరిగింది.

ఉరకలెత్తిన ఉత్సాహం

- అప్పలరాజుపురంలో జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు
- అర్జునగిరి ఎడ్ల జతకు ప్రథమ బహుమతి



ఎడ్ల పరుగు పోటీల్లో దౌడు తీస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: చీడికాడ మండలం అప్పలరాజుపురంలో జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు ఉరకలేసిన ఉత్సాహంతో సాగాయి. స్థానిక లలితాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఇక్కడ హైస్కూలు ప్రాంగణంలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతగా ఇదే మండలం అర్జునగిరి గ్రామానికి చెందిన పరువాడ నాయుడుబాబు ఎడ్ల బండి నిలిచింది. ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ స్థానం లెక్కల సత్తిబాబు (లెక్కలవాని పాలెం)రూ.8 వేలు, తృతీయ స్థానం బుచ్చెయ్యపేట, చుక్కపల్లి ఎడ్ల జతలు రూ.6 వేలు దక్కించుకున్నాయి. తర్వాత వరుస స్థానాల్లో నిలిచిన వెలంపాడు నాయుడు ఎడ్ల జతకు రూ.4 వేలు, జనపరెడ్డి మురళీ(నర్సయ్యపేట) రూ.3 వేలు నిలవగా, పోతల సత్తిబాబు(దేవరాపల్లి), పరువాడ నాయుడు ఎడ్ల జతకు సమానంగా రూ.2 వేలు చొప్పున అందజేశారు. ఏడో బహుమతి కాశీ (ఎల్.బి.పట్నం) ఎడ్లబండి రూ.వెయ్యి దక్కించుకుంది. వీరికి ఎంపీపీ కురచా జయమ్మ, నారాయణమూర్తి, సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. ఈ పోటీలను తిలకించడానికి చీడికాడ, మాడుగుల, బుచ్చెయ్యపేట, దేవరాపల్లి, మండలాల నుంచి ప్రజలు తరలి వచ్చారు.

రేపటి నుంచి బాలల ప్రతిభాపాటవ పోటీలు



యూనియన్ ప్రతినిధులతో కలిసి పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్

నర్సీపట్నం: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి నిర్వహించే జిల్లాస్థాయి బాలల ప్రతిభాపాటవ పోటీలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.గోపినాథ్ పేర్కొన్నారు. ఈ పోటీల బ్రోచర్‌ను మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆయన ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 26న చిత్రలేఖనం, 27న దేశభక్తి గీతాలు, 28న పద్యపఠనం, 29న క్విజ్, 30న వక్తృత్వ, 31న వ్యాస రచన, నవంబర్ 1న మట్టి, కాగితంతో వివిధ కళాకృతులు, 13న విచిత్ర వేషధారణ పోటీలు, 14న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని ఆయన తెలిపారు. కల్చరల్ ప్రోగ్రాం కన్వీనర్లు బాబీ మాస్టర్, యూనియన్ రాష్ట్ర కౌన్సిలర్ అల్లు అప్పారావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కురచా రమణ, నర్సీపట్నం మండల అధ్యక్ష, కార్యదర్శులు అడిగర్ల వరహాలనాయుడు, జి.వి.రమేష్ పాల్గొన్నారు.

పాలవ్యాను ఢీకొని వ్యక్తి దుర్మరణం



సింహాచలం (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: పాలవ్యాను ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందగా..మరొకరు తీవ్ర గాయాలయ్యాయి. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాతగాజువాక పల్లా వారి వీధి నుంచి చట్టివానిపాలెంకు పల్లా సింహాచలం (రాజు) (43), అతని స్నేహితుడు వారణాసి జనార్దన్ ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. సోమవారం రాత్రి 9.30 నుంచి 10 గంటల మధ్య ప్రాంతంలో పంతులుగారి మేడ వద్దకు వచ్చే సరికి వీరి వెనుక వస్తున్న హెరిటేజ్ పాల వ్యాను బలంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న జనార్దన్ ఎడమ పక్కన ఉన్న డివైడర్‌పై పడిపోగా, వెనుక కూర్చున పల్లా సింహాచలం కుడి వైపు రోడ్డుపై పడిపోయాడు. పాల వ్యాను వెనుక చక్రాలు రాజు పొట్టపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. జనార్దన్ రెండు కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గాజువాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ అప్పలరాజు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన పాలవ్యాను డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, వ్యానును స్టేషన్‌కు తరలించారు. మృతుడు పల్లా సింహాచలం ప్రైవేట్ పనులు చేసుకుంటుంటాడని, భార్యా, కుమార్తె ఉన్నారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రుడు జనార్దన్ పాతగాజువాకలో నూడిల్స్ షాపు నిర్వహిస్తుంటాడని తెలిపారు.

సరదాగా ఈతకు వెళ్లి మృత్యువాత

- కామునిగెడ్డ జలాశయం ఊబిలో చిక్కుకుని యువకుడి మృతి



అరుణ్(ఫైల్)

రావికమతం: పండగ పూట విషాదం నెలకొంది. విజయదశమి వేడుకకు స్వగ్రామానికి వచ్చిన యువకుడు స్నేహితులతో సరదాగా ఈతకు వెళ్లి జలాశయం ఊబిలో చిక్కుకుని మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఉన్నత చదువు చదువుకుని ప్రయోజకుడైన ఒక్కగానొక్క కుమారుడు ఇక లేడన్న వాస్తవాన్ని అతడి తల్లిదండ్రులకు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ విషాద ఘటన మండలంలోని కన్నంపేటలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కోసూరి నాగరాజు కుమారుడు అరుణ్(22) ఇంజినీరింగ్ చదువుకుని ఇటీవల హైదరాబాద్‌లో చిన్న కంపెనీ ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తున్నాడు. దసరా పండుగకు ఇంటికి వచ్చిన అతడు తన మిత్రులతో కలిసి కామునిగెడ్డ జలాశయంలో ఈత కొట్టేందుకు సోమవారం సాయంత్రం వెళ్లాడు. జలాశయంలో మిత్రులంతా ఈత కొట్టి ఒడ్డుకు చేరారు. అరుణ్ ఇంకా రాకపోవడంతో సహచర మిత్రులు వెతకగా, ఎంతకూ రాకపోవడంతో అతడి తండ్రికి ఫోన్ చేశారు. దీంతో తండ్రి నాగరాజు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ తన సిబ్బందితో అక్కడికి వెళ్లి గజ ఈతగాళ్లతో వెతికించగా ఊబిలో చిక్కుకున్న అరుణ్ మృతదేహాన్ని బయటకు తీశారు. దీంతో అరుణ్ తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఏఆర్ పోలీసుల ఆయుధ పూజ



కైలాసగిరి ఏఆర్ పోలీస్ కార్యాలయంలో అమ్మవారిని పూజిస్తున్న ఎస్పీ దంపతులు

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లోని కైలాసగిరి పోలీస్ మైదానంలో ఏఆర్ పోలీసులు మంగళవారం దసరా సందర్భంగా ఆయుధ పూజ చేశారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాలను అమ్మవారి చిత్ర పటం వద్ద ఉంచి, పూజించారు. ఈ పూజలకు అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ దంపతులు హాజరయ్యారు. పోలీస్ అధికారులతో పాటు ఎస్పీ దంపతులు పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, సతీష్, అరవింద కిశోర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

వివాహిత హత్య కేసులో నిందితుడు అరెస్ట్

సీతమ్మధార(విశాఖ ఉత్తర): వివాహితను హత్య చేసిన పిన్నింటి ఉమామహేశ్వరరావును ద్వారకా పోలీసులు మంగళవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ద్వారకానగర్ 3వ లైన్, సత్య శ్రీదేవి ఎన్‌క్లేవ్‌లో ఆరిలోవకు చెందిన సువ్వాడ సుజిత(36) అలియాస్ సుజాత టెలీకాలర్‌గా పనిచేస్తోంది. ఈమె భర్తకు దూరంగా, తన ఇద్దరు పిల్లలతో ఆరిలోవ ప్రాంతం క్రాంతినగర్‌లో నివసిస్తోంది. అదే ప్రాంతానికి చెందిన ఉమామహేశ్వరరావు ఈమెను గత బుధవారం సాయంత్రం బలంగా పొడిచి, తన కంఠం కూడా కోసుకున్నాడు. గాయపడ్డ అతడిని పోలీసులు చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స అనంతరం మంగళవారం డిశ్చార్జ్ అయిన అతడిపై సీఐ ధర్మేంద్ర కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

సోలో సైక్లింగ్‌లో కృత్తికా చతుర్వేది ఘనత

తాటిచెట్లపాలెం : సోలో సైక్లింగ్‌లో భారత నావికాదళానికి చెందిన అధికారి సతీమణి కృత్తికా చతుర్వేది ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక సైక్లింగ్ సీజన్‌లో రెండు సెట్స్‌ను పూర్తి చేసిన మొట్టమొదటి మహిళగా అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ఈమె 200, 300, 400, 600 కిలోమీటర్లను ఒక సైక్లింగ్ సీజన్‌లో పూర్తిచేశారు. అడక్స్ క్లబ్ పర్షియన్, ఫ్రాన్స్‌చే ధ్రువీకరించిన ప్రైవేట్ డెస్ రాన్‌డోన్యూర్స్ ఆధ్వర్యంలో ఈమె ఈ ఘనతను సాధించారు.

కంబాలకొండ ట్రెక్కింగ్.. చెప్పలేనంత థ్రిల్లింగ్



మూడు కిలోమీటర్లు ట్రెక్కింగ్ ట్రాక్ ద్వారం

ఆరిలోవ: నగరంలో పర్యాటక ప్రాంతాల్లో కంబాకొండ ప్రత్యేకమైనది. వినోదంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో ట్రెక్కింగ్ సదుపాయం కూడా ఉంది. అటవీ శాఖ అధికారులు సుమారు 100 ఎకరాల్లో ఎకో టూరిజం పార్కు ఏర్పాటు చేశారు. వీరి ఆధ్వర్యంలో శంభువానిపాలానికి చెందిన వీఎస్ఎస్ సభ్యులు దీన్ని నిర్వహిస్తున్నారు. సహజసిద్ధమైన అడవుల్లో ట్రెక్కింగ్‌కు వెళ్లేవారికి మంచి అనుభూతి కలుగుతుంది. ఎత్తుపల్లాలు, కొండల మధ్య లోయలు దాటుకుంటూ వెళితే మధ్యమధ్యలో వందలాది ఔషధ మొక్కలు కనిపిస్తాయి. వివిధ జాతులకు చెందిన రంగురంగు పక్షులు, చెంగుచెంగుమని గెంతులేసే చుక్కల జింకలు, చెట్ల కొమ్మలు లాంటి కొమ్ములతో కణుజులు, ముళ్ల పందులు, నెమళ్ల తదితర వన్యప్రాణులు తారసపడతాయి. నగరం మధ్యలో ఎక్కడా ఇలాంటి వాతావరణం లేదు. నగరాన్ని ఆనుకొని ఉన్న డెయిరీ ఫారం, జూ పార్కు, ఎండాడ, మధురవాడ, కొంట్యాం, అడవివరం, ఆరిలోవ ప్రాంతాల మధ్యలో కంబాలకొండలున్నాయి.

2, 3,7 కిలోమీటర్లు ట్రెక్కింగ్

అధికారులు 2,3,7 కిలోమీటర్ల చొప్పున ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నారు. ఒకరు నుంచి ఎంతమందైనా గుంపుగా వెళ్లవచ్చు. ముళ్ల తుప్పలు, కొండల మధ్య లోయలు, ఎత్తుపల్లాలు, రాళ్ల గుట్టలు దాటుకొంటూ ప్రయాణించాలి. రూ.200 (ఒక్కొక్కరికి) టికెట్ తీసుకుని ట్రెక్కింగ్‌కు వెళ్లాలి. వారితో పాటు కంబాలకొండలో పనిచేస్తున్న సిబ్బందిలో ఒకరు గైడ్‌గా వెళతారు. మూడు కిలోమీటర్లు ట్రెక్కింగ్ ట్రెక్ కంబాలకొండ క్యాంటిన్ నుంచి ప్రారంభమై బోటింగ్ నిర్వహించే చెరువు వెనుక భాగంలో ముగుస్తుంది. రెండు, ఏడు కిలోమీటర్ల ట్రెక్కింగ్‌కు వెళ్లేవారు క్యాంటిన్ ఎదురు మార్గం ద్వారా ప్రవేశించాలి. కొంత దూరం వెళ్లిన తర్వాత రెండు కిలోమీటర్లు దారి బోటింగ్ కొలను వైపు తిరిగిపోతుంది. ఏడు కిలోమీటర్లు దారి మాత్రం మూడు కొండలు మధ్య నుంచి జాతీయ రహదారిని ఆనుకొని జంతు పునరావాస కేంద్రం పక్కన ముగుస్తుంది. వేసవి కాలంలో రోజూ ఇక్కడ ట్రెక్కింగ్ వెళుతుంటారు. దీంతో పాటు కార్తీక మాసంలో కూడా యువకులు గుంపులుగా ట్రెక్కింగ్‌కు వెళుతుంటారని కంబాలకొండ నిర్వాహకులు చెబుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

TO - LET
■ To - Let For Commercial Shop & Office. Purpose 850 Sft. Kommadhi to Sivasakthinagar Main Road Facing. Ph : 62815 24674 [V-776860]

Services

BUSINESS OFFER
■ ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 7015828102 [HA-788339]

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 11135]

SEPTIC TANK CLEAN
■ నాయుడు GVMC సెప్టిక్ క్లీనింగ్ హైటెక్ మిషన్‌తో ఇరుగుపొరుగు వారికి ఎటువంటి దుర్వాసన లేకుండా అతి తక్కువ ఖర్చుతో 5 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్ : 90009 29977, 90009 93838 [V-2218]

www.sakshi.com

OLD AGE HOME
■ విశాఖ లైఫ్ కేర్ సీతమ్మధార డాక్టర్స్ కాలనీలో వృద్ధులకు, మంచాన ఉన్నవారికి ఆధునిక వసతులతో పాటు భోజన, డాక్టర్స్, నర్స్, ఆయా సదుపాయం. మీ ఇంటి వద్దే మా సేవలు. ఫోన్: 98482 99968, 93907 96698 [V-11708]

Wanted

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221788]

■ సెక్యూరిటీ గార్డులు, హౌస్ కీపింగ్, హెల్పర్లు, ఫీల్డ్ సూపర్‌వైజర్లు కావలెను. PF, ESI, జీతం : 15వేలు, RSR, జగదాంబ థియేటర్ నుంచి జిల్లి కోర్టు రోడ్డులో, విమల్ షోరూమ్ పై, 3rd ఫ్లోర్, వైజాగ్. ఫోన్: 87904 11889, 73085 82829 [V-1242]

■ Wanted Male Marketing Vice Principals and Marketing Executives, Qualification Any Inter / Degree, Age Limit: 21 to 45 years, Salary: Negotiable, place of work : Master Minds College, Vizag. Contact: 9989893943, 8008556073 [G-4755]

■ అంజన్న హోమ్‌కేర్‌లో పెద్దవారికి సేవలు చేయుటకు Exp. ఫ్రీ/పు/నర్సులు కావలెను. జీతం: 18000/- నుండి 25,000/-వరకు ఇవ్వబడును. కూకట్‌పల్లిలో, Hyd. Ph: 9966568882/ 9963489661 [HA-750]

■ రామకృష్ణ గ్రూపు (AP NO-1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను. భోజనం+వసతి+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52828, 92814 52833 [B-1068147]

■ వర్క్ ఫ్రమ్ హోమ్, డిజిటల్ వర్క్, వయస్సు : 18 to 55 మధ్య, Qul : 10th/ఇంటర్/డిగ్రీ, ఆపైన, Part / Full అవకాశం. Deenarmai ✆ 95155 54748 [B-413]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్సను, పిల్లలను చూసుకొనుటకు వంట/ఇంటి పని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 20K. ఫోన్: 8977639662, 8977639663 [HA-765]

సినిమా వార్తల కోసం లాగ్‌ఆన్ అవ్వండి
www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!! సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
అద్దెకు • అమ్మకం • రియల్ ఎస్టేట్ • ఫర్నిచర్స్ • ఆటోమొబైల్స్ • కంప్యూటర్స్ • సర్వీసెస్ • కావలెను
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా నాలుగు లైన్లు రూ.475/- అదనపు లైను రూ.100/- + 5% జి.ఎస్.టి. అదనం

క్లుప్తంగా

మరిడిమాంబ ఉత్సవం రేపు



కశింకోట: మండలం కేంద్రంలో మరిడిమాంబ ఉత్సవాన్ని గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గవరపేటలోని కనక మహాలక్ష్మి వీధి, కస్పా వీధి పాలాల్లో గల మరిడి మాంబ ఆలయాల్లో ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. రాత్రి సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గత గురువారం అమ్మ వారి పుట్టుక ఉత్సవాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి ఆలయంలో రోజూ పూజలు జరుపుతూ వారం రోజుల తర్వాత ఉత్సవం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

నేడు కామాక్షి అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన

అనకాపల్లిటౌన్: గవరపాలెం నిదానందొడ్డి వద్దగల శ్రీకామాక్షిఅమ్మవారి ఆలయం వద్ద బుధవారం మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను మంగళవారం ఓ ప్రకటనలో అన్నారు. శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా ప్రతి ఏడాదివలే విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు.

అమీన్‌సాహెబ్‌పేటలో జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

కశింకోట: మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట సచివాలయంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని సోమవరం, నరసాపురం, గొబ్బూరుపాలెం గ్రామస్తులు వినియోగించుకోవాలని కోరారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



కశింకోటలోని అఫీషియల్ కాలనీలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కశింకోట: స్థానిక 3వ సచివాలయ పరిధిలోని అఫీషియల్ కాలనీలో రూ.20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి మంగళవారం శ్రీకారంచుట్టారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గడప గడపకు మనప్రభుత్వంలో ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. దీంతో పనులు ప్రారంభించినట్టు చెప్పారు.

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
లియో	:సత్యనారాయణస్క్రీన్-1
చిన్నా	:సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి	: షిర్డిసాయి
టైగర్ నాగేశ్వరరావు	: పర్తిసాయి
గణపథ్(తెలుగు)	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
భగవంత్ కేసరి	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 2,292 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,910	4,250
రెండో రకం	3,530	4,130
మూడోరకం	3,390	3,520

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 46 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-16 యూనిట్లు, బి పాజిటివ్-19 యూనిట్లు, ఒ పాజిటివ్-6 యూనిట్లు, ఒ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 256 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 162 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601
సాక్షి



గౌరీ పంచాయతన దేవాలయంలో క్షీరాభిషేకం



కామాక్షిదేవి ఉత్సవ విగ్రహానికి డ్రైఫ్రూట్స్‌తో అలంకరణ




కన్యకాపరమేశ్వరిదేవి



రాజరాజేశ్వరిదేవి అలంకరణలో సత్యనారాయణపురం కనకదుర్గమ్మవారు



కశింకోట కనకదుర్గ ఆలయంలో మహిషాసుర మర్దనిగా..



వెదురుపర్తిలో రాజరాజేశ్వరి దేవి అలంకరణలో దుర్గాదేవి

నవరాత్రి ఉత్సవాల్లో ఆఖరి రోజు విజయదశమి నాడు దుర్గామాతను రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. తొమ్మిది రోజుల పాటు వైభవంగా జరిగిన శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. దసరా సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, తమను కరుణించమని అమ్మను వేడుకున్నారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీఎత్తున అన్నసమారాధనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమలను మేళతాళాలు, డప్పువాయిద్యాలు, బాణసంచా వెలుగుల మధ్య ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు.



రాజరాజేశ్వరి దేవి అలంకరణలో అమ్మ వారు

వందే శుభకరి.. సర్వార్థ సంపత్కారి



కన్యకాపరమేశ్వరి ఆలయంలో 'శమీపూజ' చేస్తున్న కమిటీ సభ్యులు, అర్చకులు



నూకాంబిక ఉత్సవ విగ్రహానికి అవభృథ స్నానం చేయిస్తున్న చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ధర్మకర్తలు



సతకంపట్టు కనకదుర్గమ్మను దర్శించుకున్న వైఎస్సార్ సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్



అండర్‌బ్రిడ్జి వద్ద దుర్గమ్మను దర్శించుకుంటున్న జాజుల రమేష్, ప్రసన్నలక్ష్మి దంపతులు



కశింకోటలోని గవరపేట మధ్య వీధిలో దుర్గాదేవికి నివేదించిన వంటకాలు

- చివరి రోజు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఘనంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

అనకాపల్లిటౌన్: పట్టణ, మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. దసరా సందర్భంగా తెల్లవారు జాము నుంచే అమ్మవారి దేవాలయాలు, మండపాల్లో విశేష పూజలు నిర్వహించారు. మహిళలు, భవానీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమపూజలు,హోమాలు జరిపారు. రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారిని అలంకరించారు.

నూకాంబిక బాలాలయంలో

ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి బాలాలయంలో పూర్ణాహూతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి(నూకాంబిక ఉత్సవమూర్తి) విగ్రహానికి అవభృథ స్నానాన్ని ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ధర్మకర్తలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఈవో బండారు ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిదేవిగా సతకంపట్టు కనకదుర్గమ్మ..

స్థానిక గవరపాలెంలో సతకంపట్టు కనకదుర్గమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు భోగారపు వెంకటరమణ(బాబు) ఆధ్వర్యంలో అమ్మవారికి కంకుమ పూజలు, హోమాలు. ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దంపతుల ఆర్థిక సాయంతో భవానీ మాలాధారణ భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ నిర్వహకులు కాండ్రేగుల నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గౌరీపంచాయతన ఆలయంలో

గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో ప్రధానఅర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

కామాక్షిదేవి ఆలయంలో డ్రైఫ్రూట్స్‌తో అలంకరణ...

నిదానందొడ్డిలో కామాక్షమ్మ ఆలయంలో కామాక్షిదేవి ఉత్సవ విగ్రహానికి డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో..

స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయంలో సోమవారం రాత్రి శమీవృక్షం వద్ద శమీపూజను ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవకమిటీ చైర్మన్ పి.శ్రీనివాసరావు, కమిటీసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సతకంపట్టు కనకదుర్గమ్మకి దాడి రత్నాకర్ పూజలు

గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మని మంగళవారం వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను దుశ్శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పి.వి.రమణ, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ మాజీ చైర్మన్ దాడి జయవీర్, పార్టీ నేతలు దాడి కృష్ణ, శిలపర శెట్టి బాబి, యల్లపు శ్రీనివాస్, వేగి త్రినాథ్, మద్దాల భీమేష్ తదితరులు పాల్గొన్నారు. దసర నవరాత్రులను పురస్కరించుకుని కొత్తతలారివానిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన మండపంలో కనకదుర్గమ్మకి గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భవాని భక్తులు, గ్రామ ప్రజలు అమ్మవారి ఘటాలను పురవీధుల గుండా ఊరేగించారు.స్థానిక వేల్పులవీధిలో రామాలయం వద్ద జై దుర్గ జైజై దుర్గ కమిటీ ఆధ్వర్యంలో కనకదుర్గ అమ్మవారు చిత్రం గీశారు.

అనకాపల్లి రూరల్: సత్యనారాయణపురం కొండపై కనకదుర్గమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. చివరిరోజు రాజరాజేశ్వరీ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గమ్మా..కరుణించమ్మా..అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి ధర్మాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ హోమశాలలో శాస్త్రోక్తంగా పూర్ణాహుతి నిర్వహించారు.ఉత్సవాలు జయప్రదం కావడానికి సహకరించిన భక్తులకు, సిబ్బంది,స్థానిక పెద్దలకు ఆలయ కమిటీ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు, ధర్మకర్తలు బోయిన రమణాజీ,,సత్తిబాబు ధన్యవాదాలు తెలిపారు.

కశింకోట: స్థానిక జాతీయ రహదారి పక్కనగల కనకదుర్గ ఆలయం సోమ, మంగళవారాల్లో భక్తులతో కిటకిటలాడిది. శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపులో భాగంగా మహిషాసురమర్దిని, రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రధానంగా భవానీ భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, తలనీలాలు రూపంలో అమ్మ వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎస్. ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు పురస్కరించుకొని అమ్మ వారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు ఎక్కువగా దర్శించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా సారె ఊరేగింపు

స్థానిక గవరపేట మధ్య వీధిలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సారె ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల వంటకాలను తెచ్చి దుర్గాదేవికి నివేదించి పూజలు చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. దుర్గాదేవి నిమజ్జనోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కోలాటాలు, నృత్యాలతో ఊరేగించారు.

తుమ్మపాల: విజయదశమి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో అండర్‌బ్రిడ్జ్ వద్ద గల శ్రీ దుర్గామాత అమ్మవారి ఆలయంలో మంగళవారం ఘనంగా పూజలు జరిగాయి. 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉగ్గిన శ్రీనివాసరావు, నడిశెట్టి మధు, వాసు, భక్తులు పాల్గొన్నారు.



సతకంపట్టు అమ్మవారి జాతరలో విద్యుత్‌దీపాల సెట్టింగ్

నూకాంబికను దర్శించుకున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారిని సోమవారం మంత్రి అమర్‌నాథ్ దర్శించుకుని, అమ్మవారి పంచలోహ విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయని చెప్పారు. అంతకుముందు జ్యోతిప్రజ్వలన చేసి అమ్మవారి ధర్మప్రచార వారోత్సవ రథాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ధర్మకర్తల భవనాన్ని ప్రారంభించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, చైర్మన్ కొణతాల మురళీకృష్ణ నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, రాష్ట్ర గవరకార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, 83వ వార్డు ఇన్‌ఛార్జి జాజుల రమేష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, సత్యనారాయణ స్వామి వివిధ దేవస్థానాల చైర్మన్లు కర్రి మహాలక్ష్మీ నాయుడు, ఆళ్ల నాగేశ్వరరావు, నుదురుపాటి తాతాజీ, పార్టీ సీనియర్ నాయకుడు దాడి జయవీర్, ఉగ్గిన అప్పారావు, సకలా గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



నూకాంబిక అమ్మవారి ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ నూతన చాంబర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కమనీయం .. కల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అన్నప్రసాద పథకానికి విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం బెంగళూర్‌కు చెందిన ఎస్.బుచ్చిరాజు అనే దాత రూ.లక్ష విరాళం అందజేశారు. దేవ స్థానం తరఫున దాతకు అన్నప్రసాద విభాగం ఏఈవో నరసింగరావు బాండ్ అందజేసి, దర్శనం కల్పించారు.

క్రీడలతో ఆరోగ్యం

అనకాపల్లిటౌన్: క్రీడల ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా టేబుల్ టెన్నిస్ చైర్మన్ కాండ్రేగుల విష్ణుమూర్తి తెలిపారు. రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీల్లో జిల్లాక్రీడాకారుల ద్వితీయస్థానం సాధించినందుకు స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో మంగళవారం వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 16వ తేదీవరకూ అనంతపురం జిల్లాలో జరిగిన పోటీల్లో జిల్లా క్రీడాకారులు ద్వితీయస్థానం సాధించడం శుభపరిణామమన్నారు. క్రీడల్లో అంతర్‌జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన క్రీడాకారులకు జగనన్న క్రీడాక్లబ్‌లద్వారా పోత్సాహం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.రామకృష్ణ, కార్యదర్శి యల్లపు శ్రీనివాసరావు, కోశాధికారి దాడి బుజ్జి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



టేబుల్ టెన్నిస్ రాష్ట్రస్థాయిపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులతో కాండ్రేగుల విష్ణుమూర్తి

రామాలయానికి సొంత ఖర్చుతో విగ్రహాలు

- వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడు దాడి రత్నాకర్

కశింకోట: మండలంలోని పరవాడపాలెం గ్రామంలో పునర్నిర్మిస్తున్న రామాలయంలో విగ్రహాలను సొంత నిధులు సమకూర్చి అందజేయనున్నట్టు అనకాపల్లి పార్లమెంట్ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు దాడి రత్నాకర్ తెలిపారు. పరవాడపాలెం రామాలయాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులతో మాట్లాడుతూ రూ.లక్షన్నర మేర వెచ్చించి సీతారామలక్ష్మణ సమేత హనుమంతుడు, లక్ష్మీ గణపతి విగ్రహాలను తయారు చేయించి ఆలయంలో ప్రతిష్టించడానికి సమకూరుస్తానన్నారు. అంతకు ముందు కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. రామాలయ కమిటీ అధ్యక్షుడు గొంతిన లోవఅప్పారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేగి దొరబాబు, మాజీ సర్పంచ్ డప్పు రామోజీ,మాజీ ఉప సర్పంచ్ కల్లెపల్లి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు గొంతిన గంగాధర్, గొంతిన శివనందినాయుడు, పరవాడ కామేశ్వరరావు, ఖాతా రమణ, పరవాడ రమణ, వార్డు సభ్యుడు గుర్రాల సత్యరావు, తదితరులు పాల్గొన్నారు.



రామాలయాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడు దాడి రత్నాకర్

ఘనంగా షిర్డీ సాయి పుణ్యతిథి మహోత్సవాలు



కొత్తూరు శారదానగర్ బాబా విగ్రహానికి ప్రత్యేక అలంకరణ



సోమవరం గ్రామంలో సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి రూరల్: కొత్తూరు మేజర్ పంచాయతీ శారదానగర్ షిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం షిర్డీ సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. షిర్డీలో మాదిరిగా బాబా నమూనా సమాధిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు, పారాయణం చేశారు. అభిషేకాలు,అర్చనలు చేసిన అనంతరం కాగడా హారతి ఇచ్చారు. మంగళవారం ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి బాబాను దర్శించుకున్నారు.ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు.సాయంత్రం బాబా మందిరంలో చేసిన దీపాలంకరణలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని సోమవరం గ్రామంలో గల షిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయ దశమి రోజున సాయిబాబా సమాధి అయ్యారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అందంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామంలో శ్రీ బంగారమ్మ ఆదిదేవతల ఆలయాలకు వెళ్లే మార్గంలో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన ముఖద్వారాన్ని సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు మంగళవారం ప్రారంభించారు. ముత్యాలు తల్లిదండ్రులైన దివంగత చింతకాయల ముత్యాలు, అమ్మోరమ్మ జ్ఞాపకార్థం దీన్ని నిర్మించారు. కార్యక్రమంలో భాగంగా డప్పులు, సాముగరిడీలు, నేలడ్యాన్సు లు, చిడతలు, తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవార్లను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

సారె.. అదిరె



అమ్మవారి సారె ఊరేగింపులో పాల్గొన్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి

పరవాడ: స్థానిక బొంకుల దిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని సోమవారం అమ్మవారి సారె ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భవానీ భక్తులు, సేవకులు ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు నడుమ పురవీధుల్లో ఊరేగించారు. వివిధ రకాల పిండి వంటలతో పాటు రకరాల స్వీట్లను అమ్మవారికి భక్తి శ్రద్ధలతో సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పెద్ద చెరువు రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పైల వెంకటరావు, వర్రి లక్ష్మి, పైల పైడింనాయుడు, సీహెచ్.శ్రీనివాసరావు, భవానీ భక్తులు, సేవకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com